ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

గురువారం 17 జూలై 2025

కేంద్ర కారాగారంలో డీఐజీ విచారణ

కడప క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని కేంద్ర కారాగారంలో పదే పదే సెల్‌ఫోన్లు దొరుకుతున్న నేపథ్యంలో అక్కడి అధికారుల పర్యవేక్షణలోపంపై పత్రిక ల్లో కథనాలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. జైళ్ల శాఖ రాష్ట్ర డీజీ అంజనీ కుమార్ ఆదేశాల మేరకు రాజమండ్రి రీజి యన్ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ బుధవారం కడప కేంద్ర కారాగారానికి విచారణకు వచ్చారు. రిమాండ్ ఖైదీ జాకీర్‌తో పాటు జైలర్ల నుంచి సూపరింటెండెంట్ దాకా అందరినీ విచారిస్తున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ విచారణ పూర్తికాగానే వివరాలు మీడియాకు తెలియజేస్తామన్నారు.

వైసీపీ నేత కబ్జా నుంచి 29.46 ఎకరాలు స్వాధీనం



ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని నోటీసు బోర్డు నాటిన తహశీల్దారు నాగేశ్వర్‌రావు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కబంధ హస్తాల నుంచి కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమికి విముక్తి కలిగింది. జగన్ హయాంలో అధికారం అడ్డు పెట్టుకుని అడ్డగోలుగా ప్రభుత్వ భూములు ఆక్రమించి దర్జాగా పండ్లతోటలు సాగు చేసుకుంటున్న వైసీపీ వ్యవహారంపై ఈనెల 13న ఆంధ్రజ్యోతిలో 'వైసీపీ నేత మేత' అంటూ కథనం ప్రచురితమైంది. సీకేదిన్నె మండలంలోని మామిళ్లపల్లె సర్వే నెంబర్లు 738/1, 738/3, 739/1, 740/1, 743/3, 749, 748/2, 727లో.. మొత్తం 29.40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి మామిడి, జామ, దానిమ్మ నిమ్మ సాగుచేస్తున్నారు. బుగ్గవంక డ్యాం వద్ద విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పందించి విచారణకు ఆదేశించారు. అవి ప్రభుత్వ భూములని తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సీకేదిన్నె తహశీల్దారు నాగేశ్వర్‌రావు బృందం 'ఇది ప్రభుత్వ భూమి' అని బుధవారం నాలుగుచోట్ల హెచ్చరిక బోర్డులు నాటారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భూకబ్జారాయుళ్లలో కలకలం

వైసీపీ హయాంలో జిల్లాలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయి. ముఖ్యంగా కడప, సీకేదిన్నె రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు అడ్డగోలుగా ఆక్రమించారు. సొంత భూముల్లా ఇతరులకు అమ్మివేశారు. ఇందులో కడపకు చెందిన ఓ కీలక నేత పేరు బాగా వినిపించింది. ఈయన గతంలో రూరల్ పరిధిలో పనిచేసిన సీఐలు, ఎస్‌ఐలను గుప్పెట్లో పెట్టుకుని అడ్డగోలుగా భూ ఆక్రమణలకు పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి. వీటన్నింటిపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ విచారణ చేపట్టి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో కబ్జారాయుళ్లలో కలకలం మొదలైంది.

పోలీసుల వేట

- వైసీపీ హయాంలో చెలరేగిన నకిలీ పట్టాల ముఠా
- రూ.300 కోట్ల విలువ చేసే స్థలాల ఆక్రమణ
- అప్పట్లో విచారణను మధ్యలో వదిలేసిన వైనం
- మళ్లీ ఇప్పుడు విచారణ మొదలు
- విచారణకు రెవెన్యూ సహకారం అంతంతే..?



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా భూకబ్జాలు జరిగాయి. ప్రభుత్వ భూములే కాదు.. ప్రైవేటు ఆస్తులను సైతం నకిలీ పత్రాలతో కొల్లగొట్టారు. జిల్లా అంతా ఒక ఎత్తయితే.. బద్వేలులో ఫోర్జరీ గ్యాంగ్‌లు సుమారు రూ.300 కోట్ల విలువ చేసే ఆస్తులు కాజేశారు. చివరికి ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఇచ్చిన లేఅవుట్లలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన ఓపెన్ స్పేస్‌ను కూడా ఫోర్జరీ పత్రాలతో ఆక్రమించారు. భూ ఆక్రమణలపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలో ఇక్కడి భూకబ్జాలపై 2022 మేలో బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశారు. రెండు కేసుల్లో 26 మంది పేర్లు చేర్చారు. అప్పటి బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ విచారణ మొదలుపెట్టారు. పోలీసులు కూడా విచారణ చేశారు. భూకబ్జాలతో సంబంధం ఉన్న వైసీపీ పెద్ద తలకాయలు, రెవెన్యూ వారు బయటికి వస్తారని అందరూ భావించారు. అయితే కొంతమందిని అరెస్టు చేసి పెద్ద తలకాయల జోలికి పోలేదు. రెవెన్యూ అధికారులు కూడా ఇరుక్కుంటారనే ఉద్దేశ్యంతో ఆ కేసు అలా అటకెక్కించారు. బద్వేలు భూకబ్జాలపై యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని, కబ్జాలకు పాల్పడ్డ వారిని జైలుకు పంపిస్తామని హామీ ఇచ్చారు.

మళ్లీ తెరపైకి

దాదాపు మూడేళ్ల అనంతరం నకిలీ పట్టాల వ్యవహారం మళ్లీ ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఫోర్జరీ సంతకాలతో అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ రెవెన్యూ వారు, కబ్జారాయుళ్లు మరలా అక్కడ నకిలీ పత్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. భూకబ్జాలపై కలెకర్ శ్రీధర్ చెరుకూరి కఠినంగా వ్యవహరిస్తుండటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో నకిలీ పట్టాల వ్యవహారంపై ఎస్పీ అశోక్‌కుమార్ దృష్టి పెట్టారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్, రూరల్ సీఐ నాగభూషణం, ఎస్‌ఐ సత్యనారాయణ విచారణ ప్రారంభించారు. నకిలీ పట్టాల పట్టా ముఠాలో పెద్ద తలకాయల కోసం వేట సాగిస్తున్నారు.

ఆరుగురి ప్రమేయం

నకిలీ పట్టాల్లో ఆరుగురి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారని సమాచారం. కింగ్‌పిన్‌ల కోసం విచారణ ముమ్మరం చేస్తున్నారు. అయితే అనుమానితులు అనారోగ్యం సాకుగా చూపి విచారణకు సహకరించడం లేదని అంటున్నారు. గతంలోనే వారి వద్ద నుంచి కీలకమైన డాక్యుమెంట్లను, ఫోర్జరీ పత్రాలు, సీళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు విచారణలో భాగంగా పాత కేసులో నమోదైన ఇద్దరు నిందితులతో పాటు మరో నలుగురు తెరపైకి వచ్చారు. ప్రస్తుతం కలసపాడు మండలంలో వీఆర్వోగా పనిచేస్తున్న వ్యక్తి ఫోర్జరీ పత్రాల వ్యవహారంలో ముఖ్య పాత్ర పోషించారని తెలుస్తోంది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సీళ్లు, నకిలీ పత్రాలు (ఫైల్‌ఫొటో)



బద్వేలు పట్టణం


రెవెన్యూ సహకారం అంతంతే

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో బద్వేలు, గోపవరం తహశీల్దారు కార్యాలయాలున్నాయి. ఇక్కడ 70శాతం దాకా ముఖ్యమైన భూములన్నీ గోపవరం మండల పరిధిలోనివే. అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఫోర్జరీ ముఠాకు బాగా సహకరించారని చెబుతారు. రెవెన్యూ రికార్డులన్నీ ఫోర్జరీ గ్యాంగ్ చేతుల్లోకి వచ్చాయి. దీంతో ఒకే ప్లాటు నెంబరుపై ఇద్దరు ముగ్గురు పేర్లతో పట్టాలు సృష్టించడం, అమ్మడం, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం.. ఇలా ప్లాన్ ప్రకారం రెవెన్యూ, ఫోర్జరీగాళ్లు కలిసి భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రస్తుతం పోలీసుల విచారణలో పూర్తిగా సహకరిస్తే అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారులు ఇరుక్కుంటారు. అందుకే రెవెన్యూ వాళ్లు విచారణకు సహకరించలేదనే చర్చ నడుస్తోంది. అయినా సరే.. నకిలీ పట్టాల వ్యవహారం విచారణ త్వరగా పూర్తి చేసేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తండ్రి అంత్యక్రియలకు వచ్చి.. గుండెపోటుతో కొడుకు మృతి



తండ్రి మున్నెల్లి సుబ్బరాయుడు (ఫైల్‌ఫొటో)



కొడుకు మున్నెల్లి వెంకట సుబ్బయ్య (ఫైల్‌ఫొటో)

గోపవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తండ్రి అంత్యక్రియలకు వచ్చి గుండెపోటుతో కొడుకు మృతిచెందిన ఘటన బుధవారం గోపవరం మండలం కాలువపల్లెలో చోటు చేసుకుంది. కాలువపల్లెకు చెందిన మున్నెల్లి సుబ్బరాయుడు (71), రామసుబ్బమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. వీరిలో చిన్న కుమారుడు మూడేళ్ల క్రితం కువైట్‌లో మృతిచెందాడు. పెద్ద కుమారుడు మున్నెల్లి వెంకటసుబ్బయ్య(52) నెల్లూరులో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు సైతం కువైట్‌లో అనారోగ్యంతో చనిపోయాడు. చిన్నకొడుకు చదువు పూర్తయ్యి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. మున్నెల్లి వెంకట సుబ్బయ్య కువైట్ వెళ్లి ఇటీవలే తిరిగి వచ్చాడు. కాగా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మున్నెల్లి సుబ్బరాయుడు మంగళవారం రాత్రి మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలు నిర్వహించేందుకు నెల్లూరులో ఉంటున్న కుమారుడు మున్నెల్లి వెంకట సుబ్బయ్య బుధవారం సొంతూరికి వచ్చాడు. అంత్యక్రియలకు అవసరమైన సామాన్లకోసం వెళుతుండగా బద్వేలు చెరువుకట్ట వద్ద కళ్లు తిరిగి పడిపోయాడు. అతడిని ఇంటికి తీసుకెళ్లగా నోట్లో నుంచి నురగరావడంతో బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు గుండెపోటుతో మృతిచెందాడని వైద్యులు తెలిపారు. తండ్రి మరణించడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చి గుండెపోటుకు గురై కుమారుడు మృతిచెండంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

రీసర్వే పక్కాగా జరగాలి



● ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల రీసర్వే తప్పులు లేకుండా పక్కాగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి భూముల రీసర్వే, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై అదనపు సీసీఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నక్కల ప్రభాకర్ రెడ్డి జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు ఎక్కడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఫేజ్-1 లో భూముల రీసర్వే ఈ నెలాఖరు లోపు పూర్తిచేయాలన్నారు. రీసర్వే సమయంలో ల్యాండ్ రికార్డు అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి రైతు సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ల్యాండ్ రికార్డు అధికారి మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

ప్రభుత్వ పథకాల అమలులో, అర్జీల పరిష్కారంలో రెవెన్యూ యంత్రాంగం జవాబుదారీతనంతో పనిచేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ రెవెన్యూ యంత్రాంగాన్ని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో వీఆర్వోలు, సచివాలయాల అడ్మిన్ వెల్ఫేర్ సెక్రటరీలు, మండల, గ్రామ సర్వేయర్ల పనితీరుపై ఐవీఆర్‌ఎస్‌లో వచ్చిన ఫీడ్ బ్యాక్ నివేదికల ఆధారంగా డీఆర్వో విశ్వేశ్వర నాయుడుతో కలసి ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో నాణ్యం, వేగం, పారదర్శకత ముఖ్యమన్నారు. కిందిస్థాయి అధికారులు పనితీరులో ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారా? లేదా? అని ఐవీఆర్‌ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ సేకరిస్తోందన్నారు. ఐవీఆర్‌ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ అందిన వారందరిపై తహశీల్దార్లు విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేశ్‌చంద్ర, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి మంచి భవిష్యత్తు పొందండి

వేంపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని పాతక్యాంపస్‌ను పీయూసీ మొదటి, ద్వితీయ సంవత్సరం బాలికలకు కేటాయించారు. అక్కడే తరగతులు, హాస్టల్ వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓరియెంటేషన్ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులను ఉద్దేశించి అధికారులు మాట్లాడుతూ సెమిస్టర్ విధానానికి బదులు ఏడాది చివరిలో పబ్లిక్ పరీక్షలు ఉంటాయని, మధ్యలో ఆరునెలల పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. చదువుపరంగా ఎలాంటి సమస్య ఉన్నా అసోసియేట్ డీన్, అకడమిక్ డీన్‌లను సంప్రదించాలన్నారు. హాస్టళ్లలో సమస్యలుంటే వార్డెన్లను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. అకడమిక్ డీన్ రమేశ్ కైలాశ్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ వెంకటేశ్, అసోసియేట్ డీన్ రాఘవరెడ్డి, రఫి, తిరుపతిరెడ్డి, కార్తీకొరెడ్డి, లైబ్రేరియన్ కోనప్ప తదితరులు పాల్గొన్నారు. కాగాడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని సెంట్రల్ లైబ్రరీలో గురువారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. మిగిలిన మూడు ట్రిపుల్‌ఐటీలకు సంబంధించి నూజివీడు క్యాంపస్‌లో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

నాలుగు ప్రత్యేక మేజిస్ట్రేట్ కోర్టుల గడువు పొడిగింపు

కలికిరి / కడప రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 2011లో 13 ఆర్థిక సంఘం సిఫారసుల ఆధారంగా మంజూరయిన నాలుగు ప్రత్యేక రెండవ తరగతి మేజిస్ట్రేట్ కోర్టుల గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 27 మంజూరు కాగా అందులో బద్వేలు, జమ్మలమడుగు, నందలూరు, మైదుకూరులో ప్రత్యేక రెండవ తరగతి జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులు ఏర్పాటయ్యాయి. అప్పటి నుంచి వీటికి గడువును పొడిగిస్తూ వస్తున్నారు. గతంలో ఇచ్చిన గడువు మార్చి 31వ తేదీతో ముగిసింది. దీనిని తిరిగి 2026 మార్చి 31 వరకూ తాజాగా పొడిగించారు. ఈ కోర్టుల్లో కాంట్రాక్టు పద్ధతిలో జరిగిన నియామకాలన్నీ యథాతథంగా ఏకీకృత వేతనాలతో కొనసాగుతాయని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి బుధవారం ఆదేశాలు జారీచేశారు.

సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

కడప ఎర్రముక్కపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-తిరుపతి మధ్య కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలును ఈనెల 31, ఆగస్టు 7, 14, 21, 28 తేదీలలో నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 31వ తేదీ రాత్రి 10గంటలకు సికింద్రాబాద్‌లో రైలు బయలుదేరి కాచిగూడ, జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు, తాడిపత్రి మీదుగా ఎరగుంట్లకు ఆగస్టు 1వ తేదీ ఉదయం 6.28గంటలకు, కడపకు 7.05గంటలకు, రాజంపేటకు 8గంటలకు, తిరుపతికి ఉదయం 10.30గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో ఆగస్టు 1వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.40 గంటలకు తిరుపతిలో బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 6.45గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఆగస్టు 1, 8, 15, 22, 29 తేదీలలో కడప మీదుగా సికింద్రాబాద్ ప్రయాణిస్తుందన్నారు.

దేవునికడప చెరువు నుంచి.. యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



దేవునికడప చెరువులో మట్టికోసం వేచి ఉన్న టిప్పర్లు



దేవునికడప చెరువు కట్టపై మట్టితో వెళుతున్న టిప్పర్

● రైతుల పేరుతో రియల్ ఎస్టేట్‌కు..

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఇసుక, మట్టి, గ్రావెల్ ఇష్టారాజ్యంగా తవ్వుకుని సొమ్ము చేసుకున్నారు. ఓటర్లు కూడా వైసీపీకి కర్రు కాల్చి వాతపెట్టారు. అయితే చంద్రబాబు ప్రభుత్వంలోనూ మట్టి మాఫియా బరితెగించడం గమనార్హం. దేవునికడప చెరువు నుంచి ఓ ముఠా పగలు, రాత్రి తేడా లేకుండా.. అది కూడా అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతోంది. దేవునికడప చెరువు నుంచి జూన్ 11న 20వేల క్యూబిక్ మీటర్ల మట్టి తోలుకునేందుకు కేసీ కెనాల్ అధికారులు అనుమతులు ఇచ్చారు. అప్పట్లో రైతుల పేరిట తోలుకున్నారు. అయితే ఇచ్చిన అనుమతుల కన్నా భారీ ఎత్తున తవ్వకాలు జరిపారని చెబుతారు. ఆ గడువు కూడా ముగిసింది. పదిరోజులుగా దేవునికడప చెరువు నుంచి ఓ ముఠా అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వి తరలిస్తోంది. ఎక్స్‌కవేటర్లు పెట్టి సుమారు 10, 15 దాకా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండటం గమనార్హం. ఈ మట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్ల లేఅవుట్ల లెవలింగ్‌కు, ఇతర పనులకు అమ్ముకుంటున్నారు. టిప్పరు మట్టి దూరాన్ని బట్టి రూ.5వేల నుంచి 10వేల దాకా విక్రయిస్తున్నారు. రోజూ సుమారు వంద ట్రిప్పులకు పైగా తవ్వుకెళ్లడం గమనార్హం. టిప్పర్లన్నీ దేవునికడపలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలోంచే వేగంగా వెళుతుండడంతో దేవాలయానికి వచ్చే భక్తులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అడ్డగోలుగా మట్టి తోలుతున్నా కేసీ కెనాల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై కడప తహశీల్దారు నారాయణరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, దేవునికడప చెరువులో మట్టి తవ్వకానికి అనుమతినిచ్చేది కేసీ కెనాల్ అధికారులని అన్నారు. అక్కడ తవ్వకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి రావడంతో బుధవారం వాటిని ఆపివేశామన్నారు.

గురుకులాలకు పోటెత్తారు



గురుకుల ప్రవేశాల కౌన్సెలింగ్‌కు విద్యార్థులతో కలసి వచ్చిన తల్లిదండ్రులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థులు పోటెత్తారు. చిన్నచౌకు గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు జిల్లా నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లాలోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొని సీట్ల లభ్యత మేరకు విద్యార్థులను చేర్పించుకున్నారు. ఏ తరగతిలో ఎక్కడెక్కడ ఎన్ని ఖాళీలున్నాయన్న విషయాన్ని ఎక్కడా ప్రదర్శించకపోవడంతో తమ పిల్లలకు సీటు వస్తుందా, రాదా అనే ఆందోళనతో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల సిబ్బందిని ఆరా తీశారు. దీంతో పలు సందర్భాల్లో సిబ్బంది ఒకింత అసహనం వ్యక్తం చేస్తూ అసలు తమ సీట్లే లేవని చెప్పారు. సీట్లు లేనప్పుడు కౌన్సెలింగ్‌కు ఎందుకు రమ్మన్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఇప్పటికే సీట్లు పొందిన విద్యార్థులు తమకు అనుకూలమైన పాఠశాలల్లో సీట్ల లభ్యతను బట్టి మార్చుకునేందుకు అవకాశం ఉంది. అయినప్పటికీ సిబ్బంది మాత్రం సీట్లు లేవని చెప్పారు. మరికాసేపటికి అక్కడ సీట్లు ఉన్నాయి, ఇక్కడ సీట్లు ఉన్నాయంటూ చెప్పడంతో గందరగోళం నెలకొంది. గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి ఎ.ఉదయశ్రీ కౌన్సెలింగ్‌ను సమీక్షించారు. మొత్తం 572 సీట్లు భర్తీ చేశామని అన్నారు. 6వ తరగతిలో 223, 7 లో 158, 8 లో 101, 9లో 85, 10 లో 4 సీట్లతో పాటు, ఇంటర్ సెకండియర్‌లో ఒక సీటును భర్తీ చేశారు.



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న సమన్వయ అధికారి ఉదయశ్రీ

భూగర్భ డ్రైనేజీ ఎప్పటికో..

పీలేరు పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా.. అందుకనుగుణంగా వసతులు సంతరించుకోవడంలో వెనుకబడి ఉంది. ఎన్నికల సందర్భంగా నాయకులు గుప్పించే హామీలు కార్య రూపం దాల్చకపోవడంతో జనం సమస్యలతో సహజీవనం చేయాల్సి వస్తోంది. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎన్నికల సందర్భంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, 2017లో అప్పటి పంచాయతీ రాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోలేదు. దీంతో పలు వీధులు దుర్గంధ భూయిష్టంగా మారాయి. ఏళ్లు గడచి పోతున్నాయి తప్ప భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు వైపు ఒక్క అడుగు కూడా పడడం లేదు.

- పీలేరులో చిరుజల్లులకే రోడ్లపైకి మురుగు
- ధ్వంసమైన మురుగు కాలువలు
- దుర్వాసన, దోమలతో జనం సతమతం
- దుర్గంధం నడుమ ఆర్టీసీ బస్‌స్టేషన్


ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై మురుగు ప్రవాహం

పీలేరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉండగా, 150కి పైగా వీధులున్నాయి. శరవేగంగా పట్టణం విస్తరిస్తోంది. అందుకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడంతో దోమల బెడద అధికమై జనం రోగాలు బారిన పడుతున్నారు. అవసరం మేరకు. పట్టణంలో మురుగు కాలువలు నిర్మించక పోగా, ఉన్న వాటిలో క్రమబద్ధత లేక పోవడంతో రోజురోజుకూ సమస్య జటిలంగా మారుతోంది. నాలుగు చినుకులు పడితే మురుగు రోడ్లపై పరుగులు పెడుతోంది. ఆర్టీసీ బస్ స్టేషన్, ఎస్‌వీ మహల్, సుధాసుధీర్ వీధి, ఇందిరానగర్, వారపు సంత మార్గం, బండ్లవంక, మేకనేనికాలువ రోడ్, కట్టుకాలువ వీధి, రాజీవ్‌నగర్, సాయిరాం వీధి తదితర ప్రాంతాలలో మురుగునీరు రోడ్లపైకి రావడం పరిపాటిగా మారింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయం దుర్గంధానికి నిలయంగా మారింది.

పట్టణంలో అక్రమకట్టడాలు అధికం కావడంతో పలు ప్రాంతాల్లో మురుగుకాలువలు మూసుకుపోయి సమస్య మరింత జటిలంగా తయారైంది. కొన్ని ప్రాంతాలలో మురుగు కాలువ లను పూడ్చివేశారు కూడా. దీంతో మురుగు ముందుకు పోయే మార్గం లేకుండా పోయింది. మరికొన్ని చోట్ల మురుగు కాలువలు నిర్మించకుండా సీసీ రోడ్లు మాత్రమే వేసి చేతులు దులుపుకోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.


సంప్ నుంచి రోడ్డు పైకి వస్తున్న మురుగు


అండర్ డ్రైనేజీతోనే సమస్య పరిష్కారం



వర్షం వస్తే పట్టణంలోని పలు చోట్ల మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో పాదచారులు, వ్యాపారులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు పార్టీలకు అతీతంగా అందరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలి.

- ఆర్. శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి..



పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో అండర్ డ్రైనేజీ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పూర్తి స్థాయి నివేదిక రావడానికి మరికొంత సమయం పడుతుంది.

- లతీఫ్‌ఖాన్, డిప్యూటీ ఎంపీడీవో, ఇన్‌చార్జి ఈవో

ఇరుకైన రోడ్లు.. ఆపై ఆక్రమణలు..

ఇళ్ల ముందున్న రోడ్డును ఆక్రమించి సంపులు, మెట్లు నిర్మించుకోవడంతోపాటు, మొక్కలు నాటుకోవడంతో వీధులన్నీ ఇరుకుగా మారాయి. దీంతో వాహన చోదకులు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం మధ్యలో నుంచి వెళుతున్న అయ్యప్పనాయుని చెరువు సప్లై చానల్‌కు మురుగు నీరు మళ్లించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు దుర్గంధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.


అధ్వానంగా మురుగుకాలువ

పీజీఆర్‌ఎస్‌లో ఫార్మసీ విద్యార్థుల ఫిర్యాదుపై

సోషల్ వెల్ఫేర్ డీడీ విచారణ


కళాశాల డైరెక్టర్లను విచారణ చేస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ కృష్ణ

మదనపల్లె టౌన్, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): కళాశాల యాజమాన్యంలోని వర్గాల మధ్య విభేదాల కారణంగా తమ సర్టిఫికెట్లకు భద్రత లేకుండా పోయిందంటూ కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో, బుధవారం సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎస్.కృష్ణ కళాశాలలో ఓ వర్గానికి చెందిన సొసైటీ సెక్రటరీ, ప్రిన్సిపాల్ శశివర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు బి.శ్యామలమ్మ, గోవర్ధన్‌రెడ్డి, ఎర్రంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అమరావతి, అధ్యాపకులను, విద్యార్థులను విడివిడిగా విచారణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు మాటాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రెండు కంతులు విడుదల చేసినా తమ కళాశాల విద్యార్థులకు జమ కాలేదన్నారు.

మరో వర్గానికి చెందిన డైరెక్టర్లు అడ్డుపడటంతోనే ఈ సమస్య వస్తోందన్నారు. దీంతో అధ్యాపకులకు వేతనాలు చెల్లించడం కష్టంగా ఉందని వాపోయారు. విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల ఆలస్యం కావడంతో ఫీజులు చెల్లించేందుకు తాము అప్పులు చేయాల్సివస్తోందన్నారు. డీడీ కృష్ణ మాట్లాడుతూ విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని, ఎలాంటి పరిస్థితుల్లోనూ విద్యార్థులు నష్టపోకూడదని యజమాన్యానికి సూచించారు. ఈ విద్యా సంవత్సరం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవో గంగిరెడ్డి, వార్డెన్ రాంప్రసాద్, డీఎస్‌డబ్ల్యూవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏక పక్షంగా విచారణ తగదు

సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఏకపక్షంగా వ్యవహరించడం తగదని ఆ కళాశాల కరెస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల గేటు వద్ద రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లికార్జునరెడ్డి, శశికుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డితో కలసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త సొసైటీని ఏర్పాటు చేసుకుని కళాశాల నిర్వహించామన్నారు. ఈ విషయమై హైకోర్టులో వివాదం నడవగా తమకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రెండు నెలల క్రితం తమ ప్రత్యర్థి వర్గం కళాశాలను దౌర్జన్యంగా ఆక్రమించుకుందన్నారు. ఈ విషయాలన్నీ తాము డీడీ దృష్టికి తీసుకెళ్లేందుకు వస్తే కళాశాల గేట్లు మూసివేసి దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నా సాంఘిక సంక్షేమ డీడీ కృష్ణ విచారణకు రావడం హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అన్నారు.

డీడీ ఒక వర్గాన్ని మాత్రమే విచారణ చేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఏ విధంగా నష్టం కలిగించినా తాము ఊరుకోమని హెచ్చరించారు.

కల్తీ ఎరువుల స్వాధీనం


పురుగు మందులను స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

కలికిరి, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో రెండు దుకాణాల్లో భారీగా కల్తీ రసాయనిక ఎరువులు పట్టు బడ్డాయి. విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారులు బుధ వారం కలికిరిలోని రెండు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలీ ట్రేడర్స్‌లో 12 టన్నుల కల్తీ ఎరువులు పట్టుబడగా వాటి విలువ రూ.2.31 లక్షలుగా నిర్ధారించారు. సిరి అగ్రో మార్ట్‌లో దాదాపు రూ.80 వేలు విలువచేసే టన్ను ఎరువులు పట్టుబడ్డాయి. ఈ రెండు దుకాణాల్లో గుర్తించిన ఎరువులను విక్రయించకుండా చర్యలు తీసుకున్నారు. అక్కడికి సమీపంలోని క్రాంతి ట్రాన్స్‌పోర్టులో దాదాపు ఆరు నెలల నుంచి నిల్వ ఉంచిన రూ.92 వేలు విలువ చేసే ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఉదయం పీలేరులో విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ముందు జాగ్రత్తగా మూసేశారు. దీంతో అధికారులు కేవలం రెండు దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేయ గలిగారు. ఈ దాడుల్లో తిరుపతి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కల్యాణదుర్గం వ్యవసాయ శాఖ ఏడీ ఏఎస్.యల్లప్ప, స్థానిక వ్యవసాయాధికారులు ఎం.హేమలత, పవన్ కుమార్, వీఆర్వో ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు


రాజశేఖర్

పెద్దతిప్పసముద్రం జూలై (ఆంధ్రజ్యోతి) : తమ కుమారుడు అదృశ్య మయ్యాడని రాపూరివాండ్లపల్లె గ్రామపంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన కృష్ణమ్మ పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9వ తేదీన వేంకటేశ్వర స్వామి దర్శనానికని తిరుమలకు వెళ్లిన తన కుమారుడు రాజశేఖర్ తిరిగి రాలేదని, మొలకలచెరువుకు వెళ్లి అక్కడి నుండి రైలులో తిరుమలకు వెళతానని చెప్పి వెళ్లాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. వివిధ ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని, తమ కుమారుని గుర్తించి తమకు అప్పగించాలని ఆమె ఫిర్యాదులో విన్నవించారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

పీలేరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. స్థానిక చెన్నారెడ్డి వీధిలో కాపురముంటున్న వెంకటేష్ ఇంటి ముందు పార్క్ చేసిన బుల్లెట్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మల్లెలవీధిలో కాపురం ఉంటున్న నజీర్ ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీని, తిరుపతి మార్గంలో మరో బుల్లెట్ చోరీకి గురైంది. దీంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీలోని బలిజపల్లె క్రాస్ వద్ద గత నెల 21న గుర్తుతెలియని వాహనం ఢీకొని దిగువపల్లెకు చెందిన ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే సంఘటనలో తీవ్రంగా గాయపడిన కృష్ణమ్మ అనే మహిళ మదనపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులుతెలిపారు.

డ్రిప్ పైపులు చోరీ..

పెద్దతిప్పసముద్రం జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తన పొలంలోని డ్రిప్ పైపులు చోరీకి గురయ్యాయని స్థానిక బెస్తవీధికి చెందిన బెస్తగవ్వల మంజునాథ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక రంగసముద్రం రోడ్డులోని తమ పొలంలో అమర్చిన డ్రిప్ పైపులను ఈ నెల 13వ తేదీ రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ తాను అప్పులు చేసి ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పైపులను చోరీ చేశారని, గతంలో కూడా రెండు సార్లు ఇలాగే జరగడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని స్థానిక పోలీసులను కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఐషర్ వాహనం ఢీకొని ద్విచక్రవాహన దారుడు గాయపడ్డాడు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివారాల మేరకు బుధవారం సాయంత్రం పీలేరు నుంచి బెంగళూరు వెళుతున్న ఐషర్ వాహనం తురకపల్లె సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై వెళుతున్న షేక్ సయ్యద్ సాహెబ్ కాలు విరిగింది. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి కుమారుడు ఖాదర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'దేశం కోసం మధ్యవర్తిత్వం'పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేశం కోసం మధ్యవర్తిత్వం అన్న అంశంపై వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు, పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ మాట్లాడుతూ ప్రధానంగా వ్యాజ్యానికి ప్రత్యామ్నాయంగా మధ్యవర్తిత్వాన్ని ఎంచుకుని కక్షిదారులతో చర్చించి, కేసులకు పరిష్కార మార్గం చూపాలన్నదే సుప్రీం కోర్టు భావన అని తెలిపారు. న్యాయస్థాన పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివాదాలు, ప్రమాద క్లైంలు, చెక్‌బౌన్స్ కేసులు, గృహ హింస, క్రిమినల్ కేసులు, సర్వీసు విషయాలు, తదితర కేసుల విషయంలో కక్షి దారులకు అవగాహన కల్పిస్తూ వీలైనంత త్వరగా కేసులను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక ఉర్దూ హైస్కూల్ వద్ద నుంచి న్యాయవాదులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, సెక్రటరీ రమణ, న్యాయవాదులు, ద్వారకనాథరెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, జుడిషియల్ సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ' కార్యక్రమం పరిశీలన


కురిజల గ్రామస్తులతో కేంద్ర బృందం


రామసముద్రం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిజల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమాన్ని బుధవారం కేంద్రం బృంద సభ్యుడు హేమంత్ పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి చెత్త పొడి చెత్త సక్రమ నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ సందర్శించి కంపోస్ట్ తయారీ, మరుగుదొడ్ల వినియోగంపై గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లోని మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్ల వినియోగం, పారిశుధ్య నిర్వహణపై సర్వే నిర్వహించి ఆయా గ్రామ పంచాయతీలకు ర్యాంకులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.మంగమ్మ, ఎంపీడీవో గఫూర్, మదనపల్లి నియోజకవర్గ రిసోర్స్ పర్సన్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి నరసింహులు, ఇంజనీరింగ్ సహాయకులు శ్రావణి, వెల్ఫేర్ సహాయకులు సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్ రత్నమ్మ, సంఘమిత్ర భూలక్ష్మి, ఏఎన్ఎం రుక్మిణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు, జరిమానా..


ముద్దాయిలతో సిద్దవటం పోలీసులు

సిద్దవటం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగిపై హత్యాయత్నం చేయడంతోపాటు, ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన కేసులో రాజోలి మల్లికార్జున, రాజోలి రత్నమ్మకు రెండేళ్ల ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం బద్వేల్ సీనియర్ సివిల్‌జడ్జి వైజే పద్మశ్రీ తీర్పునిచ్చారని సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2018 డిసెంబరు 29న రాజోలి మల్లికార్జున, అతని తల్లి రత్నమ్మ జూనియర్ అసిస్టెంట్ గుమ్మళ్ల రామకృష్ణారెడ్డిపై గట్టిగా కేకలు వేసి కోర్టు మర్యాదకు భంగం కలిగించడంతోపాటు, అడ్డువచ్చిన కోర్టు కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని పిడిగుద్దులు గుద్ది దాడిచేయడంతో అతను కింద పడిపోయాడరన్నారు. కుర్చీతో కానిస్టేబుల్ తలపై దాడికి యత్నించాడన్నారు. అప్పటి సిద్దవటం ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేశారన్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుని తరపున అదనపు పీపీ శ్రీనివాసులు వాదనలు వినిపించారన్నారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను సకాలంలో ప్రవేశపెట్టి నేరం రుజువు చేసి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైవర్ల ఘర్షణ : 'తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్' ధ్వంసం


గాయపడిన డ్రైవర్, ధ్వంసమైన వాహనం

మదనపల్లె అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల ఘర్షణతో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనం ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బురకాయల కోటకు చెందిన రమణయ్య కుమారుడు శ్రీనివాసులు(37) మదనపల్లెలో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం వాహనాన్ని ఆస్పత్రిలో పార్కింగ్ చేసే సమయంలో పృధ్వీరాజ్ అనే డ్రైవర్ మద్యం మత్తులో శ్రీనివాసులుతో గొడవ పెట్టుకుని, రాయితో దాడిచేసి గాయపరిచాడు. నిలిపి ఉన్న తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనం అద్దాలను పగలకొట్టి చంపుతాయని బెదిరించాడు. ఈ గొడవలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను మదనపల్లె ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆ మేరకు రెండో పట్టణ పోలీసులు విచారణ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

నిలిపి ఉంచిన కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

మదనపల్లె అర్బన్, జూలై 16: మండలంలోని వేంపల్లె గ్రామం సమీపంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్ద నిలిపి ఉంచిన కారు బుధవారం రాత్రి దగ్ధమైంది. ఈ ఘటన జరిగిన సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, కారు వద్ద ఎవరూ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలను, ఇతర వివరాలను సేకరించారు. మదనపల్లె పట్టణం, రెడ్డీస్‌కాలనీకి చెందిన రామాంజులరెడ్డి కారులో తన తమ్ముడిని కర్ణాటక రాష్ట్రం, చింతామణిలో దింపి తిరిగి వస్తుండగా ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి సమీపంలోకి రాగానే హఠాత్తుగా కారులోంచి మంటలు అంటుకోవడంతో కారు డ్రైవర్ పీరాతో కలసి కారు నుంచి దిగిపోయారని, ప్రమాదవశాత్తూ ఈ సంఘటన జరిగినట్లు శివప్ప తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దమండ్యం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 6న పెద్దమండ్యం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15) తల్లి మదనపల్లికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం గాలివీడుకు చెందిన రామకృష్ణ(19) గమనించాడు. వెంటనే ఇంట్లోకి వెళ్లి గడియ వేసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదే సమయంలో బాలికకు వరసకు పెద్దనాన్న అయిన వ్యక్తి ఇంటి తలుపులు కొట్టడంతో రామకృష్ణ కిటికీ లోనుంచి నుంచి దూకి పారి పోయాడు. జరిగిన సంఘటనను బాలిక పెదనాన్నకు చెప్పింది. తరవాత మదనపల్లి నుంచి ఇంటి కొచ్చిన తల్లికి కూడా వివరించింది. ఈ నెల 15వ తేదీన బాలిక తల్లి పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడు రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పీలేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పీలేరులో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ పీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు-తిరుపతి రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ అదాలత్ ఛైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, సభ్యులుగా మధుకుమార్, విజయలక్ష్మి వ్యవహరిస్తారని ఆయన వెల్లడించారు. పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఏవైనా అపరిష్కృత విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని ఆయన ప్రజలకు తెలియజేశారు.

బిట్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్స్


బండపల్లి సమీపంలోని బిట్స్ కళాశాల (ఇన్‌సర్ట్) కళాశాల ఛైర్మన్ మన్నూరు భాస్కర్

రామాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు అత్యధిక డిమాండ్ ఉందని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ఛైర్మన్ మన్నూరు భాస్కర్ తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి తమ కళాశాలకు 60 సీట్లు కేటాయించగా, మేనేజ్‌మెట్‌కోటాలో మరో 60 సీట్లకు అడ్మిషన్ ఇస్తున్నామని కళాశాల విజయవాడ, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు తదితర పట్టణాల్లో ఏ ఏ కోర్సులు ఉన్నాయో ప్రస్తుతం రాయచోటి సమీపంలోని బిట్స్ కళాశాలలో ఆ కోర్సులన్నీ ఉన్నాయన్నారు. తమ కళాశాలలో ఫీజులు మధ్య తరగతి విద్యార్థులకు అనుకూలంగా ఉంటాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులు ఉండగా ఏఐకి భారీ డిమాండ్ ఉందన్నారు.

సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో విజయకేతనం


ఇంజనీరింగ్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బిట్స్ కళాశాల విద్యార్థులు

ఇంజనీరింగ్ మొదటి, రెండవ సెమిస్టర్ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ఆయన తెలిపారు. కంప్యూటర్ అండ్ సైన్స్ విభాగంలో సుమారు 88 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 86.6 శాతం మార్కులు సాధించి సాజిదా మొదటి ర్యాంకు , 80.5 శాతంతో సానతాబసుమ్ రెండవ ర్యాంకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సాయిదర్శిని 80.5 శాతంతో మొదటి ర్యాంకు, జాహ్నవి 79 శాతంతో రెండవ ర్యాంకు, వెంకటేశ్ 78.5 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలియజేశారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఎస్ రెడ్డి, కంప్యూటర్‌సైన్స్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ టీ. వెంకటరత్నం, ఏఐహెచ్‌వోడీ ప్రొఫెసర్ సమీయా సుల్తానాలు అభినందించారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి


ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సకాలంలో నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి


వీరాంజనేయులు మృతదేహం

చిన్నమండెం, జూలై16(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరకొరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశాపురం గ్రామ పంచాయతీకి చెందిన ఉసిరికాయల వీరాంజనేయులు (45), శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై రాయచోటి నుంచి కేశాపురానికి వెళుతుండగా దేవపట్ల క్రాస్ వద్ద మదనపల్లి డిపోకు చెందిన ఆర్డినరీ బస్సు ఢీకొంది. దీంతో తలకు గాయమై వీరాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులను తిరుపతిలోని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు.. జేడీఏ



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న జేడీఏ చంద్రానాయక్

వేంపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులందరికీ సరిపడా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వల ఉన్నాయని, ఎక్కడ కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. పంటల సాగులో రైతులు అధిక మోతాదులో యూరియాను ఉపయోగించడం మానుకోవాలని, అధిక మోతా దులో యూరియా వాడకం వలన చీడపీడలు ఎక్కువ అవుతాయ న్నారు. వేంపల్లె వ్యవసాయ కార్యాలయంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరూ తమ పొలంలో భూసారపరీక్ష చేయించుకొని పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని తెలిపారు. వరి సాగు చేసే రైతులు పాతరకాలను వదిలేసి కొత్తవంగడాలైన ఆర్ఎన్ ఆర్ 1502, కేఎన్ఎమ్ 1632 సాగు చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో ప్రత్యామ్నయంగా కంది వేసుకోవాలని సూచించారు. అరటి పంటకు యూరియా వేయడం వల్ల గాలులకు త్వరగా పడిపోతాయని, దిగుబడి తగ్గుతుందని తెలిపారు. 80శాతం సబ్సిడీతో డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ అధికారిని కలిసి పొంద వచ్చన్నారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి, ఏఈఓ మల్లికార్జున, వినోద్, రైతులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్డు పనులు నాణ్యతగా చేపట్టండి



వాటర్‌షెడ్డు పనులను పరిశీలిస్తున్న
పీడీ ఆదిశేషారెడ్డి, రాష్ట్ర విజిలెన్స్ అధికారి గోపినాథ్

బి.కోడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాటర్‌షెడ్డు పథకం కింద చేస్తున్న పనులను నాణ్యతగా చేయాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం పెదుళ్లపల్లె, మేకవారిపల్లె, ప్రబలవీడు గ్రామ పంచాయతీల్లో వాటర్‌షెడ్డు పథకం కింద చేస్తున్న పనులు, చేసిన పనులను రాష్ట్ర విజిలెన్స్ డైరెక్టర్ గోపినాథ్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డకౌట్ గుంతలకు గజ్జిరాయి కటకం వేయరాదని, తెల్లరాయి, ఫైటింగ్‌రాయి మాత్రమే వాడాలన్నారు. వర్షం నీరు దిగువకు పారే వంకలో మాత్రమే చెక్‌డ్యాంలు, డకౌట్ గుంతలు నిర్మించాలని, గుట్టల మీద, దిమ్మెల మీద చెక్‌డ్యాంలు, డకౌట్ గుంతలు నిర్మించరాదన్నారు. అలా చేస్తే బిల్లులు రావని, పనులు పక్కాగా నాణ్యతగా చేపట్టాలని తెలిపారు. అలాగే రైతులు వాటర్‌షెడ్డు పథకం కింద తమ తమ పొలాల్లో వాలు ప్రదేశంలో డకౌట్ గుంతలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. వాటర్‌షెడ్డు పథకం కింద జరిగే పనులను వాటర్‌షెడ్డు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్డు ఏపీవో వేణుగోపాల్‌రెడ్డి, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

భార్య, బామ్మర్ది చేతిలో వ్యక్తి మృతి



మృతి చెందిన సుబ్బరాయుడు

కడప క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యతో గొడవ పడుతున్న వ్యక్తిని అతని బావమరిది అడ్డుకోబోయి గట్టిగా తోయడంతో కిందపడి తలకు తీవ్ర గాయమై మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కడప నగరం ఎర్రముక్కప ల్లెలోని పల్లావారి వీధిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు. ప్రొద్దుటూరు పట్టణంలోని ఇసుకలదిన్నె గ్రామానికి చెందిన దేవాంగుల సుబ్బరాయుడు (30) పదేళ్ల క్రితం అక్క కుమార్తె హర్షితను వివాహం చేసుకున్నారు. వీరికి 8 సంవత్సరాల కొడుకు, 7సంవత్సరాల పాప ఉంది. సుబ్బరాయుడు గ్రానైట్ పనులు చేసుకుంటూ ఎర్రముక్కపల్లెలోని పల్లావారి వీధిలో ఉంటున్నారు. సుబ్బరాయుడు అక్క కూడా సమీపంలో ఉంటున్నారు. సుబ్బరాయుడు రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి కూడా ఫుల్లుగా మద్యం తాగి భార్య హర్షితతో గొడవ పడుతుండగా ఆమె తమ్ముడు హరిక్రిష్ణ ఇంట్లోకి వచ్చి బావకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో అతన్ని కొట్టేందుకు వెళ్లగా వారిరువురూ గట్టిగా సుబ్బరాయుడును తోయడంతో కిందపడి తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. కాగా హరిక్రిష్ణను, హర్షితను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్లు?

కడప క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంతో పాటు పలుచోట్ల చోరీలకు పాల్పడ్డ చైన్ స్నాచర్లు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఒంటరిగా వెళుతున్న మహిళలను టార్గెట్ చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులు చోరీ చేసే ముగ్గురిని పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించినట్లు తెలుస్తోంది. కడప జిల్లాతో పాటు పలుచోట్ల వీరు గొలుసు దొంగతనాలకు పాల్పడి దోచుకున్న బంగారాన్ని ఎక్కడెక్కడ పెట్టారని విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రెండు మూడురోజుల్లో వీరిని అరెస్టు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

విద్యుత్తుషాక్‌తో వ్యక్తి మృతి



బద్వేలుటౌన్, జులై 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ర్టానికి చెందిన మహమ్మద్ సోను (28) విద్యుత్తుషాక్‌తో మృతి చెందా డు. పోలీసుల వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ర్టానికి చెందిన మృతుడు మహమ్మద్ సోను ధర అనే అనిమేట్ కంపెనీ ద్వారా మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులోని చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు ఆపరేటర్‌గా విధులకు వచ్చాడు. ఆ యంత్రాన్ని సరిచేస్తున్న సమయంలో బోర్డు దగ్గర కేబుల్ వైరు షాక్‌కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి

- వన్ కె వాక్‌లో జిల్లా ప్రధాన జడ్జి యామిని



వన్ కె వాక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని డీఎల్ఎస్ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్ నుంచి నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకు.. అక్కడ నుంచి తిరిగి న్యాయసేవా సదన్‌కు మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతపై వన్ కే వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై జూలై 10 నుంచి 16 వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. నైపుణ్యంతో కక్షిదారుల సమస్యలను పరిష్కరించుకునే అవకాన్ని కల్పించే ప్రత్యేక ప్రక్రియే మధ్యవర్తిత్వమన్నారు. ప్రతి ఒక్కరు అవగాహనను పెంపొందించుకొని తద్వారా కేసులను సులువుగా పరిష్కరించుకోవాలన్నారు. మధ్యవర్తి అంగీకార పత్రంలో షరతులను కక్షిదారులకు వివరించి.. ఖరారు చేసి ఒప్పంద పత్రాన్ని తయారు చేస్తారన్నారు. మధ్యవర్తిత్వ ప్రతిష్టంభనలు, రాజీ ఒప్పందాలను అదిగమించడం, ఆధునిక మధ్యవర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, కేస్ స్టడీస్, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద వ్యూహాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ, అరవ, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తులు గరికపాటి దీనబాబు, ఎన్.శాంతి, జి.రమేష్‌కుమార్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, జడ్జిలు కె.ప్రత్యూషకుమారి, జి.సి.ఆసిఫా సుల్తానా, కె.భార్గవి, ఎం.ఈశ్వర్ వెంకటప్రసాద్, జి.విజయలక్ష్మి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సెక్రటరీ చంద్రవదన, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కడప బార్ అసోసియేషన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ మాట్లాడారు. అలాగే న్యాయసేవా సదన్‌లో హిట్ అండ్ రన్ కేసులలో పరిహారం, చెల్లింపు తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో శ్రావణమాస ఉత్సవాలు విజయవంతం



గండి ఉత్సవాల బుక్‌లెట్లను విడుదల చేస్తున్న దృశ్యం

చక్రాయపేట,జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసద్ధిగాంచిన గండి క్షేత్రంలో శ్రావణమాసోత్సవాలను అన్ని శాఖల అధికారుల సహకారంతో విజయవంతం చేస్తామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజలు పేర్కొన్నారు. బుధవారం దేవస్థాన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల బుక్‌లెట్‌లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రావణ మాస ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తారన్నారు. వారికి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా చలువ పందిళ్ల, క్యూలైన్‌లు, పాపాఘ్ని నదిలో భక్తులు స్నానాలు చేసేందుకు షవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానంతో పాటు భక్తుల అన్నదాన కార్యక్రమాలు విరివిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయం నుంచి ఇన్‌స్పెక్టర్ సి.శివయ్య, ఆలయ మాజీచైర్మన్ వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, ఆలయ సూప రింటెండెంట్ సుభాష్, వైద్యాధికారి వాణి, సీఐ ఉలసయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండిలో టెండర్లు : గండి క్షేత్రంలో ఏడాది పాటు పూలు విక్రయించుకునేందుకు, టోల్‌గేట్ వసూలుతో పాటు శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణకు సంబంధించి బుధవారం టెండర్లు నిర్వహించారు. పూల విక్రయానికి తొమ్మిది మంది పోటీ పడగా వేంపల్లె మండలం కత్తులూరు గ్రామానికి చెందిన టి.మల్లికార్జున రూ.20,05,000 పాట పాడి టెండర్‌ను దక్కించు కున్నారు. అయితే టోల్‌గేట్ వసూలుకు ఎవరూ ముందుకు రాలేదు. అలాగే శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ చేసే హక్కునకు సీల్డ్‌టెండర్లు ఎవరు దాఖలు చేయలేదని, ఈ రెండు వాటికి టెండర్లు నిలిపివేశామని, ఈనెల 23న మళ్లీ నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు.

ఎరువుల తయారీ కేంద్రాలు, దుకాణాల్లో తనిఖీలు





కడపలో ఎరువులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం, మైదుకూరులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కడప రూరల్, జూలై16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఎరువులు తయారీ కేంద్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల హోల్‌సేల్ దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు, కడప జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో ఎస్.గోవర్ధన్, మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సంయుక్త బృందం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో రిజిష్టర్లను, స్టాక్ నిల్వలను పరిశీలించారు. కాలం చెల్లిన ఉత్పత్తులు ఏమైనా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని 32 లక్షల విలువల గల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు డీలర్లతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, అనుమతి కలిగిన ఎరువులను మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి రోజు స్టాక్ బోర్డు, ధరల పట్టికను అప్డేట్ చేసి ఉంచాలన్నారు. లైసెన్సులు లేకుండా వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మైదుకూరు మండలంలో...

మైదుకూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల, పురుగుల మందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లిఖార్జున్‌రావు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. జీవి సత్రంలోని శ్రీశక్తి ట్రెడర్స్, శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీస్, శ్రీనివాస ట్రేడర్స్, తిరుమల ఆగ్రో ఏజెన్సీస్‌లలో రికార్డులను అప్డేట్ చేయనందుకు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ డీఆర్‌సీ ఏడీఏ సంగు వెంకటేశ్వర్ రావు, ఏడీఏ క్రిష్ణమూర్తి, మండల వ్యవసాయశాఖ అధికారి బాలగంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి హంతకులను శిక్షించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని గంటికోటలో దారుణంగా హత్య చేసిన హంతకులను శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో వైష్ణవిని హత్య మిస్టరీని ఛేదించి హంతకులను పట్టుకోవాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థి వైష్ణవి హత్య లాంటి సంఘటనలు జరగడానికి కారణాలు బహిర్గతం కావాల్సిన అవసరం వుందన్నారు. కార్యక్రమంలో గుర్రమ్మ ప్రమీల తదితర ఐద్వానాయకులు పాల్గొన్నారు.

సాగునీరు వదలడంలో అధికారుల నిర్లక్ష్యం : ఎంపీ

పులివెందుల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని సాగునీటి అధికారులు ఏడాది కాలంగా నిర్లక్ష్యం వహించారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మినీ సెక్రటేరి యట్‌లోని నీటి పారుదలశాఖ డీఈని ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని చెరువులకు నీటిని అందించే విషయమై చర్చించారు. ఎర్రబల్లె ఎరువు, భూమయ్యగారిపల్లె చెరువులకు నీరివ్వాలని కోరారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో నీటిపారుదల వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. ఏడాదిగా నియో జకవర్గంలోని చెరువులను నీటితో నింపే కార్యక్రమం సక్రమంగా సాగడం లేదన్నారు. గండికోట, పైడిపాళెం ప్రాజెక్టులతో పాటు సీబీఆర్‌లో పుష్కలంగా నీరు ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు కూడా నిండు కుండలా ఉందన్నారు. అన్ని ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నా పులివెందుల నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందించే పరిస్థితి లేదన్నారు. యర్రబల్లె చెరువుకు నీరు ఇవ్వకపోవడంతో చుట్టుపక్కల పది గ్రామాలపై ఈ ప్రభావం చూపుతుందన్నారు. సత్వరమే చెరువులకు నీరందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసీపీ నాయకులు బలరామిరెడ్డి, జడ్పీటీసీ బయపురెడ్డి, సాంబశివారెడ్డి తదితరులలు పాల్గొన్నారు.

నెల్లూరుపై అనంత జట్టు గెలుపు

- కర్నూలు, కడప మ్యాచ్ డ్రా
- మల్టీ డే క్రికెట్ టోర్నీ



రోహిత్‌రోషన్, కమ్రుద్దీన్, ప్రమోద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రమోద్ కుమార్ ఆరు వికెట్లతో చెలరేగడంతో మల్టీ డే క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టుపై అనంత జట్టు విజయం సాధించింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు బుధవారం మూడోరోజు అనంతపురం నగరంలోని అనంత క్రీడాగ్రామంలో కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు ఓవర్‌నైట్ స్కోరు 243/5తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 319 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్ ప్రమోద్‌కుమార్ 6 వికెట్లతో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు 44.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 315 పరుగులు సాధించింది. రోహిత్‌రోషన్ హాఫ్ సెంచరీ(46 బంతుల్లో 72)లో ఆకట్టుకున్నాడు. దీంతో అనంత జట్టు 4వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మరో గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప 105 ఓవర్లలో 459 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 74.1 ఓవర్లలో 268 పరుగులకు 7వికెట్లు కోల్పోయింది. కర్నూలు బ్యాటర్ కమ్రుద్దీన్ సెంచరీ (111)తో జట్టును ఆదుకున్నాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి



ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్‌స్టేషన్‌లో
పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

కడప ఎర్రముక్కపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల విద్యుత్ సమస్యపై వెంటనే స్పందించాలని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. బుధవారం కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో సబ్‌స్టేషన్, లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. అనంతరం రూరల్ సబ్ డివిజన్ విభాగం సిబ్బందితో, అధికారులతో సమా వేశం నిర్వహించారు. వేల మందికి ఉపాధికల్పించే పారిశ్రామికవాడలో ఒక్క అంత రాయం ఏర్పడినా ఉత్పత్తి అనుకున్నంత మేర పొందలేరన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతం ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది, అధికారులను శాలువ, సర్టిఫికెట్లతో సన్మానించారు. కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ హరిసేవ్యానాయక్, డీఈఈ సుబ్రహ్మణ్యం, రామచంద్రరెడ్డి, ఏఈలు తదతరులు పాల్గొన్నారు.

ఉప్పలూరు గ్రామస్థుల దాతృత్వం



బాధితులకు ఆర్థిక సహాయం
అందజేస్తున్న గ్రామస్థులు

కాశినాయన, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలూరు పీర్ల పండుగలో గాయాలపాలైన 11 మంది బాధితులకు బుధవారం గ్రామస్థులు రూ.2.15లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మొహర్రం పండుగ చివరిరోజైన గత ఆదివారం ఒకవైపు కోలాటాలు, మరోవైపు పీర్లకు ప్రత్యేక పూజలు నడుస్తున్నాయి.. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అగ్నిగుండం పూడ్చే సమయంలో ప్రమాదవశాత్తు గుడం సమీపంలో కోలాటం తిలకిస్తున్న 11 మంది భక్తులపై వేడి బూడిద, అగ్ని రవ్వలు పడి కాళ్లు, చేతులు కాలి ఆసుపత్రుల్లో చేరారు. వీరందరికి గ్రామస్థులు తమవంతు సాయంగా రూ.2.15 లక్షలు వసూలు చేసి అందజేశారు. మానవతా దృక్పథంతో గ్రామస్థులు అందించిన సహాయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తపాలా సేవలు మరింత వేగవంతం

- కడప డివిజన్‌లో సాంకేతిక 2.0 విధానం అమలు
- తపాలాశాఖ కడప డివిజన్ సూపరింటెండెంట్ రాజేష్



మాట్లాడుతున్న రాజేష్

కడప మారుతీనగర్, జులై 16 (ఆంధ్రజ్యోతి): తపాలా సేవలు మరింత వేగ వంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి రానున్నాయని కడప డివిజన్ సూపరింటెండెంట్ జి.రాజేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తపాలా ప్రధా న కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తపా లాశాఖ ప్రజలకు మరింత నాణ్యమైన రీతిలో సేవలు అందించేందుకు అనువుగా కడప పోస్టల్ డివిజన్ పరిధిలో గల 451 తపాలా కార్యాలయా లలో ఈనెల 22వ తేదీ నుంచి సాంకేతిక 2.0 విధానం అమలు చేయను న్నట్లు వెల్లడించారు. ఈ కొత్త విధానంతో సాంకేతిక మార్పులతో తపాలా సేవల్లో వేగం, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీల నిర్వ హణ తక్కువ సమయంలో ట్రాకింగ్‌తో వినియోగదారులకు అందు బాటులోకి రానుందన్నారు. ఈ విధానం అమలుకు అవసరమైన సన్నాహాల్లో భాగంగా ఈనెల 19 నుంచి 21 వరకు తపాలా కార్యా లయాల్లో సేవలను తాత్కాలికంగా నిలిపివేసి డేటా ట్రాన్స్‌ఫర్, సాంకేతిక మరమ్మతులు త్వరిత గతిన పూర్తిచేసి ఈనెల 22 నుంచి అన్ని తపాలా కార్యాలయాలలో పునఃప్రా రంభమై ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నామన్నారు. ప్రజలు తపాలా సేవలను అందిపుచ్చుకుని సహకారం అందించాలని కోరారు.

అర్ధరాత్రి తాగునీటికి మహిళల ఆందోళన



కడప క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కడప నగరం ముత్తరాసుపల్లికి చెందిన మహిళలు చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న పాత పంచాయతీ ఆఫీస్ వద్ద ఆందోళనకు దిగారు. నాలుగు రోజుల నుంచి కొళాయిలకు నీళ్లు రావడం లేదని దీంతో పనులు మీద బయటకు పోవడంలేదని, కనీసం మరుగుదొడ్లకు వినియోగించుకునేందుకు కూడా నీరు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి అర్ధరాత్రి నీళ్లు వదులుతున్నారన్నారు. మంగళవారం ముత్తరాసుపల్లె వద్ద జరిగిన ఎమ్మెల్యే కార్యక్రమంలో నీటిసమస్యను ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆమె అధికారులకు తెలిపిననూ నీరు వదలడం లేదని పేర్కొన్నారు.

భూ కబ్జాలపై నగరంలో ప్రజాఉద్యమం

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

కడప మారుతీనగర్, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): నగరంలో గత 5 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు, స్థలాలను ప్రైవేటు వ్యక్తులు సాగించిన కబ్జాలు రోజురోజుకూ పెరుగు తున్నప్పటికీ వాటిని అరికట్టడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని అఖిలపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. రానున్న కాలంలో ఆ విషయంగా ప్రజా ఉద్యమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. సీపీఎం నగర కమిటీ కార్యదర్శి రామమోహన్ అధ్యక్షతన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో భూకబ్జాలు, కాలువలు, శ్మశానాల ఆక్రమణలపై అఖిలపక్ష, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆ మేరకు కడపను కబ్జాదారుల కంబంధ హస్తాలనుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న నగర అంబేడ్కర్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు మనోహర్, సీఐటీయూ నాయకుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి, బీఎస్పీ నాయకులు నగిలి గుర్రప్ప, ఆర్పీపీ నాయకుడు బాబు, ఆర్ఎస్పీ నాయకుడు సుబ్బారాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, లోక్‌సత్తా పార్టీ నాయకుడు దేవర శ్రీకృష్ణ పాల్గొన్నారు.







కడప నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కడప ఎర్రముక్కపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా కడప అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కడపనగరం రవీంద్రనగర్ వద్ద ఉన్న షామిరియా బ్రిడ్జి, లా కాలేజ్ బ్రిడ్జి ప్రాంతాలను హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంజనీరింగ్ పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చాలా కాలంగా నిర్మాణానికి నోచుకోక ట్రాఫిక్ సమస్యలతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఈ బ్రిడ్జిల నిర్మాణం చేస్తామని కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం వీటిని పూర్తిచేస్తామన్న మాటకు కట్టుబడి ముందుకెళ్తున్నామని చెప్పారు. త్వరలో ప్రణాళిక రూపొందించి పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఎస్ఈ చెన్నకేశవరెడ్డితో పాటు పలువురు అధికారులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఇంటింటి ఓటర్ల సర్వే చేపట్టాలి

సీకేదిన్నె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి అధికారులు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్వహించాలని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని బీఎల్‌వోలకు బుధవారం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూలులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టి కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్లు, వలసవెళ్లినవారి ఓట్లను తొలగించడం చేయాలన్నారు. అదే విధంగా ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచేయాలని (ప్రక్రియఅంతా సజావుగా ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దారు అహల్య, ఏఎస్‌వో చంద్రకళ, ఆర్ఐ వీరేంద్ర, బీఎల్‌వోలు, ఎలక్షన్ ఆపరేటర్ గీతాంజలి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో అధికారులు వైఫల్యం

కడప నాగరాజుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు వైఫల్యం చెందారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి అన్నారు. నగరపాలక కార్యాలయం వద్ద కడప మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యూఈఈయు మద్దతు తెలియజేసిన అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సినరక్షణ పరికరాలను సైతం ఇచ్చేందుకు అనుమతులు లేవనిచెప్పడం హాస్యాస్పదమన్నారు.

బుగ్గవంకపై బ్రిడ్జి నిర్మించక పోతే నిరాహారదీక్షకు దిగుతాం : కాంగ్రెస్

కడప కలెక్టరేట్, జూలై16(ఆంధ్రజ్యోతి): బుగ్గవంకపై బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టక పోతే నిరాహార దీక్షకు దిగుతామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుగ్గవంకను విజయజ్యోతి సందర్శించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్‌ను కలసి విజయజ్యోతి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గౌస్‌పీర్,పులివెందుల కోఆర్డినేటర్ ధ్రువకుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి

చెన్నూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : డెంగీపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ అన్నారు. చెన్నూరు మండలంలోని గుర్రంపాడు గ్రామంలో డెంగీ మాసోత్సవంలో భాగంగా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ముందు జాగ్రత్తగా దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో జిల్లాసహాయ మలేరియా అ ధికారి వెంకటరెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసరు మురళీధర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పులివెందులలో క్లబ్బులపై పోలీసుల దాడులు

పులివెందుల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని రెండు క్లబ్‌లపై సీఐ చాంద్‌బాషా తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పులివెందులలోని రిక్రియేషన్స్ క్లబ్‌లలో గ్యాంబ్లింగ్ తదితరవి ఏమైనా జరుగుతున్నాయా అని తనిఖీ చేశామన్నారు. ఈ క్లబ్‌లలో గ్యాంబ్లింగ్‌లాంటి కార్యక్రమాలు ఏమీ సాగలేదని సీఐ తెలిపారు.గ్యాంబ్లింగ్‌లాంటి కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం



కడప ఎర్రముక్కపల్లె, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): కడప నగరం 47వ డివిజన్‌లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు మేయర్ సురేష్‌బాబు, మాజీ ఉపముఖ్య మంత్రి అంజాద్‌బాషా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి బుధవారం కడపనగరం 47వ డివిజన్‌లో రోడ్డు, కాల్వల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు పాక సురేష్‌కుమార్ బాలస్వామిరెడ్డి, వైసీపీ నాయకులు రామలింగారెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, చిలకపాటి భాస్కర్,రాజ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దేవస్థానం పోస్టర్స్ ఆవిష్కరణ

కడప మారుతీనగర్, జులై 16 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస వారోత్సవాలలో భాగంగా పాలకొండరామస్వామి దేవస్థానంలో ఈనెల 25 వ తేదీ నుంచి 23 వరకు జరుగనున్న వారోత్సవాల పోస్టర్లను బుధవారం నగర ద్వారకానగర్‌లో ఉన్న ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీ పాలకొండరామస్వామి దేవస్తానం ఆలయ ఛైర్మన్ బుర్రి రెడ్డయ్య యాదవ్, ఆలయ ఈఓ కె. శ్రీనివాసులు, మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకుడు యోగేష్, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలి

లింగాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ రామకృష్ణయ్య అన్నారు. లింగాల ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల వంట ఏజెన్సీదారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు.

పులివెందులలో ప్రతి ఎకరాకు నీరందిస్తాం

పులివెందుల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని తుంగభద్ర హెచ్ఎల్‌సీ ఛైర్మన్‌మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పంప్ హౌస్‌ల మరమ్మతులు, నిర్వహణకు ఒక్కరూపాయి కూడా ఖర్చుచేయలేదన్నారు. సీబీఆర్ కింద 15పంప్‌హౌస్‌లు ఉన్నాయన్నారు. అందులో ఎర్రబల్లె, భూమయ్యగారిపల్లె పంప్ హౌస్‌ల టాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యా యన్నారు. వాటి మరమ్మతులు పూర్తవుతూనే నీరందిస్తా మన్నారు.

సమస్యలు వెలుగులోకి తేవడంలో మీడియా కీలకం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రజాప్రతినిధులు అందిస్తున్న సేవలను బహిర్గతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల పాత్ర కీలకమని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని ఓ ఫంక్షన్‌హాలులో బుధవారం నిర్వహించిన కడప నగర ఫొటో, వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో మెంబరు ఆర్.శ్రీనివాసరెడ్డి ,కడప ఫొటో, వీడియోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కడప నాగరాజుపేట, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని 27వ డివిజన్ గౌస్ నగర్ 165వ బూత్ ఇన్‌చార్జి అమానుల్లా, ముస్లిం మైనారిటీ నాయకుడు లయన్ పటాన్‌ఖాదర్‌బాష పేర్కొన్నారు. బుధవారం గౌస్‌నగర్‌లో సుపరిపాలన తొలి అడుగు - ఇంటింటికీ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు హబీబుల్లా, షేక్ షఫిఉల్లా, షేక్ నారాయణ, గూడుసాబ్, హుస్సేన్ పాల్గొన్నారు.

పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

పులివెందుల రూరల్,జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుదామని ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు ఆయ శాఖలలో చేపట్టిన కార్యక్రమాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

కడప ఎర్రముక్కపల్లె,జూలై 16 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కడప కార్పొరేషన్ ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) మున్సిపల్ కార్మికుల ఆందోళనకు సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ సందర్శించి, వారికి సంపూర్ణ మద్దతు తెలియజేశారు.



విజయవాడలో మంత్రి లోకేశ్‌ను బుధవారం కలిసి పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని కోరుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు

















విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నతస్థాయికి ఎదగాలని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం కడపలోని సాయిజూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఎంతో క్రమ శిక్షణతో అద్భుతమైన ప్రణాళికతో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందించారు. డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ మాట్లాడారు.



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఆర్ఐఓ వెంకటసుబ్బారెడ్డి, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు



కేసీ నీరు విడుదల

దువ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాచనపల్లె నీటి సంఘం పరిధిలో ఎర్రబల్లె తూముకు బుధవారం నీటి సంఘం అధ్యక్షుడు సాకం రామసుబ్బారెడ్డి కేసీ నీటిని విడుదల చేశారు. రైతులు నీటిని అవసరమైన మేరకు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షుడు గౌస్‌బాష, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమ్మె ఉధృతం

- ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా సమ్మెలోకి దిగిన పారిశుధ్య కార్మికులు
- ఎక్కడికక్కడే నిలిచిన చెత్త
- కంపు కొడుతున్న ప్రొద్దుటూరు


కార్యాలయం నుంచి వాహనాలు బయటకు రాకుండా అడ్డుకుంటున్న కార్మికులు

ప్రొద్దుటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు రూ.26 వేల జీతం పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అందరికీ వర్తింపజేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతమైంది. ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సైతం బుధవారం సమ్మె బాట పట్టారు. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు 232 మంది, కోవిడ్ కార్మికులు 93 మంది, ఇంజనీరింగ్ కార్మికులు 104 మంది, మొత్తం 429 మంది సమ్మెలోకి దిగారు. కేవలం రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు 139 మంది, నాన్ పీహెచ్ రెగ్యులర్ ఇంజనీరింగ్ కార్మికులు, అటెండర్లు 53 మంది మొత్తం 192 మంది వున్నారు. వీరు సమ్మెలో పాల్గొనలేదు. కానీ ఔట్‌సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి ఒక్క చెత్త వాహనాన్ని కూడా బయటకు కదలనీయకుండా అడ్డుకున్నారు. కొందరు కార్మికులు ఉదయం 5.30 గంటలకు వాహనాలు బయటకు తీసే క్రమంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం గేటు వేసి అడ్డగించారు. దీంతో పట్టణంలో ఎక్కడిచెత్త అక్కడ నిలిచిపోయి ప్రొద్దుటూరు పట్టణం కంపు కొడుతుంది. ఇప్పటికే ఇంజనీరింగ్ కార్మికులు 12వ తేది అర్ధరాత్రి నుంచి సమ్మెలో పాల్గొంటుండం వల్ల పంప్‌హౌస్‌లు రిజర్వాయర్ల వద్ద రెగ్యులర్ ఉద్యోగులకు డ్యూటీలు వేసి తాత్కాలికంగా నడిపిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీకి వచ్చే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు పారిశుధ్య సేవలు బంద్ కావడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చనుంది.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి: తులసిరెడ్డి

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర మీడియా సలహాదారుడు తులసిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పీఎండీ నజీర్, జమ్మలమడుగు ఇన్‌చార్జ్ బ్రహ్మానందరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు లాయర్‌జిలాన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణయ్య యాదవ్, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి తదితరులు మద్దతు పలికారు.


పట్టణంలోని కోనేటికాల్వ వీధిలో దర్శన మిస్తున్న చెత్తకుప్ప

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న దృశ్యం

కలసపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెల్లపాడు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బుధవారం ఉచితంగా దాతలు సైకిళ్ల పంపిణీ చేయడం అభినందనీయమని ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరెడ్డిలు పేర్కొన్నారు. పాఠశాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా అప్‌గ్రేడ్‌కు చెందిన తెల్లపాడు పాఠశాల అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో కొండపేట గ్రామానికి చెందిన విద్యార్థులకు సైకిళ్లు, ఆటవస్తువులు అందించినట్లు దాతలు దేవసాని మోహన్‌రెడ్డి, బొంతారమణయ్యలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రోడ్డు నాణ్యతకు తిలోదకాలు'

పోరుమామిళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఆలిండియా మానవ హక్కుల సంఘం కార్యదర్శి ఫణిరావు, రాజోలిరెడ్డి తెలిపారు. బుధవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ పోరుమామిళ్లలో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ఒక పక్క పనులు జరుగుతుంటే మరో పక్క నెర్రలు చీలిపోతున్నాయన్నారు. మహాత్మాగాంధీ సెంటరులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. రోడ్డు వేస్తుంటే కనీసం క్యూరింగ్ చేసేందుకు నీళ్లు కూడా సక్రమంగా పోయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు.

జీరో బడ్జెట్ వ్యవసాయంపై దృష్టి సారించాలి: ఏడీఏ


నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కాశినాయన, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీరో బడ్జెట్ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని పోరుమామిళ్ల ఏడీఏ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మూలపల్లె, నర్సాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో భూసారం తెగుళ్లు, పురుగుల నివారణకు అవసరమైన ఘన, ద్రవ జీవామృతం, కషాయాలపై రైతులు అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్రమోహన్, ఏఈవో రవి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగుకు ప్రోత్సాహకం


గుడిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం

దువ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ పంటలు సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆ శాఖ మండల అధికారి రామకృష్ణ తెలిపారు. గుడిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఆయిల్‌పాం పంటలు సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.29 వేలు నీటి యాజమాన్య పద్ధతులు, అంతర పంటల సాగుకు ఏడాదికి రూ.10 వేలు సబ్సిడీ రూపంలో అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, ఉద్యాన సహాయకురాలు మాధవీలత, కేంద్రీయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కూటమికి ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు

బద్వేలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు స్థలం కేటాయించడం శుభ పరిణామమని, ఈ మేరకు సీఎం చంద్రబాబు, నారాలోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కేవీ సుబ్బారావు, సీనియర్ న్యాయవాది పి.వి.ఎన్. ప్రసాద్‌తో పాటు పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, వెంకటశివ నారాయణ, నాగభూషణం, నాగరాజ పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో డ్రోన్ల పంపిణీ

ఎర్రగుంట్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతులకు 80 శాతం సబ్సిడీతో పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్స్ ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఏవో సుజనకుమారి తెలిపారు. బుధవారం చిలంకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ సులభతరంగా మందులు పిచికారీ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం అర్హులైన రైతులకు డ్రోన్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డి, వ్యవసాయ గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం విజయవంతంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వారి సహకారంతో శివాలయం సర్కిల్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిధులుగా మున్సిపల్ కమిషనర్ రవింద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లెల రాజారాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాష, సీమాంధ్ర బీసీ సంక్షేమ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌బాబును మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి కలిశారు. బుధవారం రాజధాని అమరావతిలో కలిసి తనకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలని లోకేశ్‌ను కోరినట్లు తెలిపారు.

బి.కోడూరు: బద్వేలు నియోజకవర్గంలోని పలు సమస్యలపై వాటి అభివృద్ధి కోసం రాష్ట్ర టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బోరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి బుధవారం మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. వీరి వెంట టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు ఉన్నారు.

'సమస్యలు పరిష్కరించడంలో విఫలం'

బద్వేలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబులు మాట్లాడారు. అనంతరం వారి సమస్యలపై మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకుడు నాగార్జున, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

కాశినాయన, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 32 మంది విద్యార్థులకు డా.బాలక్రిష్టారెడ్డి ఆర్థిక సహకారంతో బుధవారం విద్యాసామగ్రి అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.చంద్రశేఖర్ తెలిపారు. పోరుమామిళ్లలోని శ్రీక్రిష్ణ ఆసుపత్రి నిర్వాహకుడు డా.బాలక్రిష్టారెడ్డి సొంత నిధులతో విద్యార్థులకు సామగ్రి అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పాండురంగాచారి, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి : డీవైఎఫ్‌ఐ

జమ్మలమడుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గండికోట పర్యాటక ప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగులోని స్థానిక ఎన్జీవో హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ పర్యాటక ప్రాంతమైన గండికోటలో అధికారులు, పోలీసు యంత్రాంగం పటిష్ట పర్యవేక్షణ, నిఘా, పెట్రోలింగ్ చేపట్టాలని కోరారు. ఇంటర్ విద్యార్థిని వైష్ణవి హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ కమిటీ సభ్యులు ప్రసాద్, కృష్ణారెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా గురుప్రసాద్

ప్రొద్దుటూరుటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా కొండాపురం గురుప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు నియమితులైన ఆయనను బుధవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణప్రదీప్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ గౌరీశంకర్, యువ మోర్చ నగర అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రవిశంకర్, ముల్లా అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరుటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అమృతానగర్‌లో ఇంటి స్థలం కబ్జా చేయడానికి నకిలీ పట్టా తయారు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌ఏ షరీఫ్ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజా సమస్యలపై ఇంటింటికి : ఎమ్మెల్సీ

జమ్మలమడుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగులోని వైసీపీ కార్యాలయంలో మైలవరం మండలానికి సంబంధించిన వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైలవరం మండలానికి సంబంధించిన పలువురు నేతలు సమస్యలను వివరించారు.

దుకాణాల తొలగింపు

జమ్మలమడుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట ఎదురుగా పీర్లచావిడి పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాలను బుధవారం పోలీసులు తొలగించారు. డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు అక్కడికి రానుండడంతో పోలీసు సిబ్బంది దుకాణాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో అక్కడ వృద్ధ మహిళతో పాటు మరో బాలిక ఏర్పాటు చేసుకున్న దుకాణాన్ని తొలగించారు.

ప్రభుత్వ పాఠశాలలు.. దేవాలయాలు : పుట్టా


మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఖాజీపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు దేవాలయాలు లాంటివని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ.. తమ స్కూల్ వద్ద బస్సులు ఆపడం లేదని, పైగా హైయ్యర్ బస్సు డ్రైవర్లు చులకనగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి మైదుకూరు డీఎంకు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం అగ్రహారం సొసైటీ చైర్మన్‌గా హరినాథరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దీంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే పుట్టా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో నాగరాజు, నాగస్వర్ణలత, ప్రధానోపాధ్యాయురాలు భారతి, టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రఓబుళరెడ్డి, సర్పంచు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

దువ్వూరు: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థినులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ గదులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లీశ్వరి, ఎంఈవో పద్మలత, ఎంపీడీవో రామకృష్ణయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు సత్వర పరిష్కారం

- జిల్లా రెండవ అదనపు జడ్జి సత్యకుమారి



ప్రొద్దుటూరు, బద్వేలులో వన్‌కే వాక్ నిర్వహిస్తున్న జడ్జి, న్యాయవాదులు

ప్రొద్దుటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి కోర్టుల్లో కేసులు నడిస్తే న్యాయం సకాలంలో జరగదని అందుకే మధ్యవర్తిత్వంతో కేసుల్లో సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా రెండవ అదనపు జడ్జి సత్యకుమారి తెలిపారు. బుధవారం రాష్ట్ర న్యాయ సేవాధికారం సంస్థ ఆదేశానుసారం మధ్యవర్తిత్వం ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచడానికి వన్ కే వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టు నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అంటే మధ్యవర్తి తన నైపుణ్యంతో కక్షిదారుల సమస్యలను తానే పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించే ప్రత్యేక ప్రక్రియ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రతిభ, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్: కక్షిదారులు ఇరువురూ కూర్చొని, మాట్లాడుకొని ఒక అంగీకారానికి వచ్చి రాజీపడి కేసులను పరిష్కరించుకునేందుకు మీడియేషన్ ఫర్ నేషన్ అన్నది ఒక మంచి అవకాశమని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మీడియేషన్ ఫర్ నేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వై.జె.పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి వై.సరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో 1కె ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీవీఎస్‌ఆర్ క్రిష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

మైదుకూరురూరల్: స్థానిక నంద్యాల రోడ్డులోని కోర్టు వద్ద నుంచి రాయల్ కూడలి వరకు 1కే వాక్ కార్యక్రమం బుధవారం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులతో పాటు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఖాజామొయిద్దీన్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ నరసింహ పాల్గొన్నారు.

జమ్మలమడుగు: పట్టణంలో జాతీయ అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బుధవారం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణం నుంచి న్యాయవాదులు ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్జి భార్గవి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.